క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీ 1,2 సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, జిల్లా కలెక్టర్ శివశంకర్ పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ వెంకయ్య తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

నేడు నూజెండ్లలో..

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల గ్రామంలోని గ్రామసచివాలయం వద్ద బుధవారం గ్రామ సభ నిర్వహిస్తున్న ఎంపీడీవో వీరభద్రాచారి, తహసీల్దార్ మధుబాబులు తెలిపారు. ప్రజలు ఈ గ్రామ సభలో పాల్గొని తమకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ గ్రామసభకు అధికారులు, గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొనాలని సూచించారు.

ఘనంగా యూనియన్ ఆవిర్భావ వేడుకలు

నరసరావుపేట: డిపోలో మంగళవారం ఎంప్లాయీస్ యూనియన్ 72వ ఆవిర్భ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యూనియన్ డిపో కార్యదర్శి ఉయ్యాల నాగేశ్వరరావు జెండా వందనం చేశారు. అనంతరం కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. పల్నాడు జిల్లా కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్, డిపో అధ్యక్ష కార్యదర్శులైన షేక్ ఆసీఫ్, జీటీ రావు, షేక్ జానితో పాటు అన్నీ స్థాయి నాయకులు, గ్యారేజీ సిబ్బంది, మహిళా ఉద్యోగులు హాజరయ్యారు.

ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ పోరాటాల ఫలితంగానే ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత ఏర్పడిందని యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కోటేశ్వరరావు చెప్పారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఎంప్లాయీస్ యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలు ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు ఎంప్లాయీస్ అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ముందుగా యూనియన్ జండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. డిపో అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు కేవై, ఎం సుబ్రమణ్యం, రత్తయ్య, కేశవులు, నాగలక్ష్మీ, రమాదేవి పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

నాదెండ్ల: వేగంగా వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు, నాదెండ్ల గ్రామానికి చెందిన విప్పర్ల మోహనరావు (50) తన తల్లి మృతి చెంది 30 రోజులు కావటంతో తాను భార్య ప్రమీలతో కలిసి చిలకలూరిపేటలోని దేవాలయంలో నిద్ర చేసేందుకు సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఆటోలో బయలుదేరారు. ఆటోడ్రైవర్ వజ్జా కోటేశ్వరరావు వేగంగా వాహనం నడపటంతో నల్లమోతు గోపాలరావు ఇంటి వద్దకు వచ్చేసరికి మలుపు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. మోహనరావు తలకు బలమైన గాయాలు కాగా, ప్రమీలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మోహనరావును చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డ్యూటీ డాక్టర్ వైద్య పరీక్షలు చేయగా, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మోహనరావు కుమారుడు విప్పర్ల సునీల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పురుగు మందు నీళ్లు తాగి 11 మేకలు మృతి

బొల్లాపల్లి: పురుగు మందు కలిసిన నీరు తాగడటంలో మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని గరికపాడు గ్రామ పొలాల్లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన అరవా నాగేశ్వరరావుకు 20 మేకలు ఉన్నాయి. వీటిని మేతకు గ్రామ తూర్పు వైపు పొలాలకు తోలుకెళ్లాడు. పొలంలో పురుగు మందు కలిసిన నీళ్లను జీవాలు తాగడటంతో 11 మేకలు మృతి చెందాయని వాపోయాడు. జీవాలు జీవనోపాధి అని ఆవేదన చేందాడు. వీటి విలువ సుమారు రూ 2 .75 లక్షలు ఉంటాయని బాధితుడు వేదన.

ఐటీఐ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

వినుకొండ టౌన్: ఐటీఐ పూర్తి చేసుకున్న నిరుద్యోగులకు మెగా జాబ్ మేళాను ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు వినుకొండ రూరల్ విఠంరాజుపల్లి గ్రామ శివారులోని శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కర్రి వెంకట్ మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో శ్రీకాళహస్తి సమీపంలోని టీవీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ, పేరేచర్ల సమీపంలోని జోసిల్ ప్రైవేట్ కంపెనీ, బోయపాలెం వద్దగల అనంత లక్ష్మీ స్పిన్నింగ్ మిల్, రాక్ మెన్ ఇండస్ట్రీస్, జిల్లెట్ బ్లేడ్ కంపెనీ, విజయ ఎలక్ట్రికల్స్, అమరరాజా బ్యాటరీస్, మావరిక్ యాక్టివేషన్, జ్యోతిర్మయి టెక్స్టైల్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఇతర వివరాలకు 8465819546, 7702892288, 9440542030, 8341821710 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నీకు వ్యతిరేక పవనాలు తప్పవు

- నిస్వార్థంగా సేవలందిస్తున్న మాపై నిందలా?
- ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతోంది వలంటీర్లే!
- బహిరంగ క్షమాపణ చెప్పాలి



వినుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు


చిలకలూరిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు


చిలకలూరిపేటలో మహాత్ముడికి క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు

వినుకొండ టౌన్: తమకు కేటాయించిన ఇంటి సభ్యులను తమ కుటుంబ సభ్యులుగా భావించి, నిస్వార్థంగా సేవలు చేస్తున్న తమపై ఏలూరులో జరిగిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదంటూ, వలంటీర్లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలంటూ పట్టణంలో వలంటీర్లు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కుటుంబ సభ్యులు కూడా దరిచేరని సమయంలో, ప్రజలను తాము కంటికి రెప్పలా చూసుకున్నామన్న సంగతిని పవన్ మరిచిపోవడం బాధాకరమన్నారు. ప్రధానంగా ఉమెన్ ట్రాఫికింగ్ చేయడమే కాకుండా కుటుంబ సభ్యుల సమాచారాన్ని వలంటీర్లు ఇతరులకు చేరవేస్తున్నారంటూ తమపై నిరాధారణమైన ఆరోపణలను చేసిన పవన్ కల్యాణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ పథకాలకు అర్హతే ప్రమాణికంగా తీసుకొని లబ్ధిదారులకు చేరవేస్తూ, దేశంలోనే అత్యుత్తమ వ్యవస్థగా వలంటీర్ వ్యవస్థ చేరుకుందన్నారు. అటువంటి వ్యవస్థలో పనిచేస్తున్న దాదాపు 2.50లక్షల మంది వలంటీర్ల మనోభావాలను దెబ్బతీస్తూ చేసిన వ్యాఖ్యలను వెనుకకు తీసుకొని, తక్షణమే వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. అంతకుముందుగా పట్టణంలోని శివయ్య స్థూపం మీదుగా పట్టణ పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చిలకలూరిపేటలో నిరసన

చిలకలూరిపేట టౌన్: వలంటీర్లు ఆడపిల్లలను అక్రమ రవాణ చేస్తున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడడం దుర్మార్గమని వలంటీర్లు మండి పడ్డారు. పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని వలంటీర్లు సమావేశమై ర్యాలీ నిర్వహించారు. ఎన్ఆర్‌టీ సెంటర్ లోని డాక్టర్ బీఆర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ వలంటీర్లు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉన్న తమపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఎటువంటి సంస్కారమని ప్రశ్నించారు. వెంటనే పవన్ బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజాసేవకే వలంటీర్, సచివాలయ వ్యవస్థ

- పాలనలో సరికొత్త అధ్యాయం
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి: మండలంలోని గుట్లపల్లి సచివాలయ పరిధిలో గంగుపల్లి తండా, గంగుపల్లిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో మంగళవారం ముగిసింది. ఆయా గ్రామాల్లో నీటి సమస్య, సైడ్ కాలువలు, అంతర్గత రహదారులు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరై ఆయా గ్రామాల్లో నవరత్నాల్లో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించి లబ్ధిదారులకు పథకాలు ఏ మేరకు అందాయో తెలుసుకొని సంక్షేమం కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 3,800 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 11.68 కోట్ల మేర సంక్షేమ పథకాలను అమలు చేశామని, సచివాలయ పరిధిలో నాడు-నేడు, స్వచ్ఛభారత్, సచివాలయ, రైతు భరోసా, హెల్త్ సెంటర్ భవనాలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.3.68 కోట్ల మేర పనులు జరిగాయన్నారు. పరిపాలనలో నూతన ఒరవడి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. రాష్ట్ర పాలనలో వలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ, పట్టణస్థాయిలో అతి దగ్గరగా ప్రజలకు మెరుగైన సేవలు అందించారని తెలిపారు. ఇవే కాకుండా విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని, నాడు-నేడులో పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం, ఆంగ్ల బోధన, అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్దలో మార్పు చేసి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో సేవలు అందించారన్నారు. ప్రతిపక్ష పార్టీలు కావాలనే బురద చల్లుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలో చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఒరగబెట్టిందేమీ లేదన్నారు. మరో ప్రతిపక్ష పార్టీకి చెందిన నేత వలంటీర్ వ్యవస్థను కించపరచడం నీచమైన రాజకీయమన్నారు. పాలనలో మహానేత రాజశేఖరరెడ్డిని మరపించే విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయుడని నిరూపించుకున్నారన్నారు. ఏడు దశాబ్దాలుగా నెరవేరని వరికెపూడిశెల ఎత్తిపోతల పథకం కల నెరవేరనుందని, త్వరలో నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఆనాటి ప్రభుత్వాలు సాధించలేని కేంద్ర స్థాయిలో టైగర్ ప్రాజెక్టు అనుమతి ఈ నాటి ముఖ్యమంత్రి పరిపాలనలో సాధ్యమైందన్నారు. వినుకొండ పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని, నీటి సమస్య తీరిందన్నారు.

సచివాలయ ప్రారంభోత్సవం

గుట్లపల్లి సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గుట్లపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.18 లక్షలతో హెల్త్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అతి చేరువగా మెరుగైన సేవలు అందించడంలో రాష్ట్రంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థ ముందంజలో ఉందని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వై. కీర్తి, బి.రాములుబాయి, ఎంపీటీసీ ఎం.వెంకటరమణ, ఎంపీపీ బత్తి రాములు, జడ్పీటీసీ ఆర్.బీమ్లీబాయి, తహసీల్దార్ ఎ.వి. సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో జిలానీబాషా, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. అందరికీ రక్ష

- అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా జగనన్న పాలన
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- వేర్వేరు ప్రాంతాల్లో ఉత్సాహంగా సురక్ష కార్యక్రమం


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

నరసరావుపేట: సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అవినీతి రహితంగా అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని 17వ వార్డులో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అందించడంలో రాజకీయాలు, కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా, ఎటువంటి అవినీతికి తావు లేకుండా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనికోసం వార్డు వలంటీర్లు, మున్సిపల్ అధికారులు పని చేస్తున్నారన్నారు. 17వ వార్డులోని ప్రజలకు గత నాలుగేళ్ల కాలంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 2.77 కోట్లు అందజేయటం జరిగిందన్నారు. మరో రూ.43 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులైన సీసీరోడ్లు, కల్వర్టులు నిర్మించటం జరిగిందన్నారు. తమకు సర్టిఫికెట్లు కావాలని వార్డులోని 609 దరఖాస్తు చేసుకోగా, అందులో 514 మందికి మంజూరైన ధ్రువీకరణ పత్రాలు, ఇళ్లపట్టాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ డి.శ్రీనివాసరావు, డీఈ ఓ.శ్రీనివాసరావు, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం.స్వామి, మాజీ కౌన్సిలర్ షేక్. మున్ని, బాలాజి రెడ్డి, వరవకట్ల బాబు, షేక్, ఖాజా, జిలాని, నాగూర్, సుభాని పాల్గొన్నారు.

11 రకాల సేవలు ఉచితం

బొల్లాపల్లి: మండలంలోని గరికపాడు, మేళ్లవాగు గ్రామసచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా బృందాలు ఆయా గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జగనన్న సురక్షలో అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి దరఖాస్తు చేసుకుంటే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నా రు.

రొంపిచర్ల: రాష్ట్రంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాలలో రొంపిచర్ల గ్రామంలో సంక్షేమానికి, అభివృద్ధికి రూ.46 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రొంపిచర్లలో ప్రజా సంక్షేమానికి రూ.26.55 కోట్లు, రూ.20 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. సచివాలయం, ఆరోగ్య కేంద్రం, ఆర్‌బీకే, మంచినీరు, రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, టీటీడీ కల్యాణ మండపం నిర్మాణాలు చేశామన్నారు. అలాగే జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరో రూ.75 కోట్ల రూపాయలతో గ్రామంలో కేంద్రీయ విద్యాలయాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ కార్యక్రమాలు అందించటంతో పాటు 11 రకాల సర్టిఫికెట్లను ఎలాంటి ఖర్చు లేకుండా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పొందవచ్చు అన్నారు. మండలంలో రెండు జూనియర్ కళాశాలలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు రాజకీయాలకు, కులమతాలకు, పార్టీలకు అతీతంగా అవినీతికి తావులేకుండా అమలు చేస్తున్నామన్నారు. రెండువేల గృహాలున్న రొంపిచర్లలో పింఛన్‌లు 876 మందికి ఇప్పటి వరకు రూ.10.50 కోట్ల రూపాయలు ఇచ్చామన్నారు. వైఎస్సార్ ఆసరా కింద రూ.3.12 కోట్లు, జగనన్న అమ్మఒడి కింద రూ.3.60 కోట్లు విద్యాదీవెన, వసతిదీవెన కింద్ర రూ.2.25 కోట్లు, వైఎస్సార్ చేయూత రూ.1.57 కోట్లు, రైతు భరోసా రూ.3.96 కోట్లు, 470 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశామన్నారు. రాష్ట్రంలో రూ.26 వేల కోట్ల రూపాయలు డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆదా య, కుల, సీసీఎల్, ఫ్యామిలీ సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే నూటికి నూరు శాతం రాయితీపై రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ గడ్డం వెంకట్రావు, సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, గాదె రామిరెడ్డి, పడాల చక్రారెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, తన్నీరు శ్రీనివాసరావు, గుండాల వెంకటేష్, హనిమిరెడ్డి, ఎమ్మార్వో అంకారావు, ఎండీవో మాధ్యూబాబు, వీఆర్వో పడాల సుబ్బారెడ్డి, తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పిచికలపాలెంలో ...

శావల్యాపురం: సంక్షేమ పథకాలు అందజేయడం, ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం సాగుతోందని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పిచికలపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హత కలిగి నేటి వరకు సంక్షేమ పథకాలు పొందనటువంటి లబ్ధిదారులకు పథకం వర్తించేలా ప్రభుత్వం ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం 615 వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ తిరివిధి శివకుమారి, ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, చినకంచర్ల గ్రామసర్పంచ్ పురేటి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరివిధి రమణారావు, కావూరి మాబుసుభానయ్య,డీఎల్‌డివో యం. వెంకటరెడ్డి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య. తహసీల్దారు షేక్ జాన్‌సైదులు,ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు,డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారమైంది



జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకంలో భాగంగా నేను రూ. 10 వేలు చెల్లించి నెలల గడుస్తోంది. అధికారులను పలుమార్లు అడిగి విసుగెత్తా. జగనన్న సురక్ష కార్యక్రమం వలన మాలాంటి పేదలకు లబ్ధి చేకూరింది. ఈకార్యక్రమంలో అధికారులు నాకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ధ్రువీకరణ పత్రం అందజేశారు. చాలా సంతోషం.

–తిరివిధి అంజమ్మ, పిచికలపాలెం

ఇది అరుదైన అవకాశం



జగనన్న సురక్ష కార్యక్రమం వలన నాలాంటి వృద్ధులకు ఆధార్‌లో తప్పులు సవరణలు మార్పులు చేర్పులు చేసుకునేందుకు సువర్ణా అవకాశం ప్రభుత్వం కల్పించటం చాలా సంతోషంగా ఉంది. ఉచితంగా ఆధార్ సేవలతో పాటు అనేక ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు ఉచితంగా ప్రభుత్వం ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేసి ఇవ్వటం గతంలో ఎన్నడూ చూడలేదు.

–బందారుపల్లి నాసరమ్మ

సామాజిక తనిఖీలపై ప్రజావేదిక

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై 15 విడత ప్రజావేదిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో వై హనుమారెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించగా, సామాజిక తనిఖీల ఎస్ఆర్‌పీ ఎం బుజ్జి, డీఆర్‌పీలు బృంద తనిఖీ వివరాలను వెల్లడించారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి 14 రోజులుగా క్షేత్రస్థాయిలో ప్రతి పంచాయతీలో సామాజిక తనిఖీలు నిర్వహించడంతో పాటు గ్రామసభలు పెట్టినట్లు ఎస్ఆర్‌పీ వెల్లడించారు. యడ్లపాడు మండలం పరిధిలో ఉపాధి పథకంతో పాటు అనుసంధాన శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1076 పనులకు నిర్వహించారు. రూ.4,96,20,134 వేతన నగదుతో పాటు రూ.1,93,49,549 మెటిరియల్ పనులతో కలిపి మొత్తం రూ.6,89,69,683 పనులపై ఆడిట్ జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం కింద 1059 పనులకు రూ.4,96,02,720 వేతనంగానూ, రూ.23,27,061 మెటీరియల్ జరిగాయి. పంచాయతీ రాజ్ ద్వారా 14 పనులకు గానూ రూ.17414 వేతనం , రూ.16399310 మెటిరియల్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా ఒక పనికి రూ.2,57,284, అలాగే సర్వశిక్షణ అభియాన్ ద్వారా రెండు పనులకు రూ.3,65,894 మెటిరియల్ కాంపౌండ్‌వెచ్చించినట్లు వెల్లడించారు. సమావేశంలో ఎంపీపీ పిడతల ఝాన్సీ, విజిలెన్స్ ఏడీ సీహెచ్ఎస్ఎస్ భ్రమరాంబ, జిల్లా ఆఫీసర్ టి విజయలక్ష్మి, క్లస్టర్ ఏపీడీ ఎ సుధాకరరావు, ఏపీవో పాల్గొన్నారు.

కిట్ల పంపిణీ వివరాల పరిశీలన

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయను ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ మంగళవారం సందర్శించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ వివరాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థులకు అందుతున్న వసతుల గురించి పరిశీలించారు. విద్యార్థుల అడ్మిషన్ల గురించి ఆరా తీశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు, కేజీబీవీ ఎస్వో మాధవీలత, జెడ్పీ హెచ్ఎం నిర్మల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పారదర్శకత ఉండాలి

యడ్లపాడు: బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి కచ్చితమైన సమాచారాన్ని సేకరించి ఎలాంటి లోపాలు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని మండల ఎన్నికల సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు ఆదేశించారు. యడ్లపాడు రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్ల విధుల నిర్వహణపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఎన్నికల కేంద్రం పరిధిలో అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటు పోకుండా చూడాలన్నారు. సవరణ విషయంలో మరింత అప్రమత్తత పాటించాలన్నారు. చనిపోయిన వారి ఓట్లను మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత కుటుంబ సభ్యుల సంతకం సేకరించి తొలగించాలని చెప్పారు.

ప్రయోగశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే


అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో విద్యార్థులతో డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.10 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ప్రయోగశాలను శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రారంభించారు. దేశంలో నీతి అయోగ్ సంస్థ ఆధ్వర్యంలో 10 లక్షల మంది విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనలు పెంపొందించేందుకు ఈ ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో రొంపిచర్ల పాఠశాల ఉందన్నారు. రూ.10 లక్షల రూపాయలతో ప్రయోగశాల భవనాన్ని అభివృద్ధి పరిచి అవసరమైన పరికరాలను అమర్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాని, ఉపాధ్యాయులు, ఎంపీపీ, జడ్పీటీసీ, మార్కెట్ యార్డు చైర్మన్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక జనాభాతో ఎన్నో సమస్యలు

నాదెండ్ల: అధిక జనాభాతో ప్రకృతి, ఆర్థిక వనరులపై తీవ్ర ఒత్తిడి పెరిగి దేశాభివృద్ధి దెబ్బతింటుందని, సామాజిక అసమానతలు ఏర్పడుతాయని స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సాయిశ్వేత చెప్పారు. నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుటుంబ సంక్షేమం, దేశ శ్రేయస్సు కోసం అందరం కుటుంబ నియంత్రణ పాటించాలన్నారు. భూమి, నీరు, సహజ వనరులు తగ్గి ఆహారోత్పత్తి తగ్గుతుందని, అధిక జనాభాతో ఇప్పటికే కొన్ని దేశాల్లో ఆకలి కేకలు, నిరుద్యోగం, పేదరికం, అసమానతలు పెరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుటుంబ నియంత్రణ పాటిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.